
70.2 శాతం పోలింగ్





పాడేరులో 63.9, అరకులోయలో 71.1, రంపచోడవరంలో 75 శాతం

- మావోయిస్టు ప్రభావిత, మారుమూల ప్రాంతాల్లోనూ ఓట్లేసిన గిరిజనం
- ప్రతి పోలింగ్ కేంద్రంలో మహిళలు, యువ ఓటర్లే అధికం

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

జిల్లాలో మహిళలు, యువ ఓటర్లు ఓటింగ్‌పై ఆసక్తి చూపడంతో మొత్తంగా 70.2 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలోని పాడేరు, అరకులోయ, రంపచోడవరం అసెంబ్లీ స్థానాల్లో మొత్తం 7,71,193 మంది ఓటర్లకు గాను సోమవారం జరిగిన ఎన్నికల్లో 5,41,360 మంది ఓటు వేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా 70.2 శాతం ఓటింగ్ నమోదైంది. పాడేరులో 63.9, అరకులోయలో 71.1, రంపచోడవరంలో 75 శాతం పోలింగ్ జరిగింది.

గిరిజన ప్రాంతంలో స్వల్పంగా పెరిగిన ఓటింగ్

2019 ఎన్నికల్లో పాడేరు అసెంబ్లీ స్థానం పరిధిలో 61 శాతం, అరకులోయలో 70, రంపచోడవరంలో 78 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో పాడేరులో 63.9, అరకులోయలో 71.1 రంపచోడవరంలో 75 శాతం ఓటింగ్ జరిగింది. ప్రధానంగా ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలనే భావన గిరిజన ప్రాంతాల్లోనూ పెరగడంతో ఉదయం ఏడు గంటల నుంచి ఓట్లేసేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులుతీరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం ... మిగతా 8వ పేజీలో

స్ట్రాంగ్ రూమ్‌ల్లో ఈవీఎంలు భద్రం

- సీఆర్‌పీఎఫ్ కట్టుదిట్టమైన భద్రత

పాడేరు, మే 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పాడేరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌లకు సెంట్రల్ రిజర్వుడ్ ప్రొటెక్షన్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్) బలగాలతో భద్రతా చర్యలు చేపట్టారు. అరకులోయ పార్లమెంట్ స్థానం, పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన ఈవీఎంలను వేర్వేరు స్ట్రాంగ్‌రూముల్లో భద్రపరిచారు. వాటికి రక్షణగా సీఆర్‌పీఎఫ్ బలగాలతో భద్రత కల్పించారు. ఓట్ల లెక్కింపులో భాగంగా జూన్ నాలుగో తేదీ వరకు ఈ భద్రతను కొనసాగిస్తారు. కాగా స్ట్రాంగ్ రూమ్ తలుపునకు సీల్ వేసినప్పటికీ, దాని ముందున్న ఇనుప గ్రిల్‌కు మాత్రం కనీసం తాళం వేయకపోవడం కొసమెరుపు.



పాడేరులోని ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్ ముందు సీఆర్‌పీఎఫ్ జవాన్, (వృత్తంలో) ఇనుప గ్రిల్ గడియకు తాళం వేయని దృశ్యం

అరకు పార్లమెంట్ పరిధిలో 73.68 శాతం

పార్వతీపురం, మే14 (ఆంధ్రజ్యోతి): అరకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 73.68 శాతం మేర పోలింగ్ నమోదైంది. మహిళలు 5,04,605 మంది, పురుషులు 4,84,442 మంది, ఇతరులు 48 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అరకులో 1,74,588 ఓట్లు, పాడేరులో 1,58,747, రంపచోడవరంలో 2,08,025 ఓట్లు పోలయ్యాయి. మొత్తంగా అరకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో 11,45,426 ఓట్లు పోలయ్యాయని మంగళవారం అధికారులు తెలిపారు.

పార్వపురం మన్యం జిల్లాలో మొత్తంగా మహిళలు 3,9,240 మంది, పురుషులు 2,94,777 మంది, ఇతరులు 42 మంది ఓటు హక్కును ... మిగతా 8వ పేజీలో

జిల్లాలో మూడు అసెంబ్లీ స్థానాల పరిధిలో ఓటింగ్ వివరాలు

అసెంబ్లీ స్థానం	మొత్తం	పోలైనవి	శాతం	పురుషులు	పోలైనవి	మహిళలు	పోలైనవి	ఇతరులు	పోలైనవి
అరకులోయ	2,45,489	1,74,588	71.1	1,19,429	87,491	1,26,053	87,096	7	1
పాడేరు	2,28,387	1,58,747	63.9	1,19,790	78,127	1,28,581	80,618	16	2
రంపచోడవరం	2,77,317	2,08,026	75.0	1,31,901	1,00,450	1,45,400	1,07,572	16	3

జిల్లాలో మూడు అసెంబ్లీ స్థానాల్లో నమోదైన పోలింగ్ శాతాల వివరాలు

అసెంబ్లీ స్థానం	పోలింగ్ కేంద్రాలు	మొత్తం	9 గం:	11గం:	1గం:	3గం:	4గం:	ఫైనల్
పాడేరు	318	2,48,387	5.6	14.3	31.3	40.1	45.7	63.9
అరకులోయ	304	2,45,489	7.0	17.9	32.4	51.8	55.8	71.1
రంపచోడవరం	399	2,77,317	7.6	12.0	34.4	54.1	59.2	75.0



సదుపాయాలు లేకపాయె!

ఓటర్లు, పోలింగ్ సిబ్బందికి తప్పని ఇబ్బందులు



రంపచోడవరంలోని హెలిప్యాడ్ స్థలంలో సోమవారం రాత్రి నిద్రించిన పోలింగ్ సిబ్బంది

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాల కల్పన మాత్రం ప్రకటనలకే పరిమితమైంది. దీంతో పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు లేక ఓటర్లు, పోలింగ్ సిబ్బంది సైతం అవస్థలు పడ్డారు. వాస్తవానికి ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీటి సదుపాయం, ఓటర్లు సేదతీరేందుకు టెంట్లు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు కల్పించాలి. అయితే అధిక శాతం పోలింగ్ కేంద్రాలు పాఠశాల భవనాల్లోనే ఏర్పాటు చేయడంతో తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలున్నాయనే ఆలోచనతో పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేకంగా తాగునీటి సదుపాయాలు అందుబాటులో ఉంచలేదు. దీంతో ఓటింగ్‌కు వచ్చే జనానికి దాహం వేస్తే గుక్కెడు నీరు తాగేందుకు అవకాశం లేకుండా పోయింది. అనేక చోట్ల పోలింగ్ కేంద్రాల ముందు ఎటువంటి టెంట్లు వేయకపోవడంతో గంటల తరబడి ఓటర్లు ఎండలోనూ నిల్చోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అయితే ఓటు వేయాలనే లక్ష్యంతో వచ్చిన ఓటర్లు అవేవీ పట్టించుకోకుండా కాస్త అవస్థలు పడినా, ఓట్లేసి ఇళ్లకు తిరుగు ప్రయాణమయ్యారు. అనేక పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ల స్లిప్‌లను రెవెన్యూ యంత్రాంగం పంపిణీ చేయలేదు. దీంతో అనేక మంది ఓటింగ్‌కు దూరమయ్యారు.



పెదబయలు మండలం పరదానిపుట్టులో పోలింగ్ కేంద్రం వద్ద సోమవారం ఎండలో నిల్చొన్న మహిళలు

రంపచోడవరంలో సిబ్బందికి ఇబ్బందులు

పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సిబ్బంది నిద్రించేందుకు సైతం సరైన సదుపాయాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అనేక మంది పోలింగ్ సిబ్బంది సోమవారం రాత్రి రంపచోడవరంలో హెలీప్యాడ్ స్థలంలోనే నిద్రించారు. ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుండడంతో పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు చర్చనీయాంశమయ్యాయి.

అంచనాల్లో అభ్యర్థులు

- పోలింగ్ ముగియడంతో సమీక్షలు
- నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు - 7లో
- విశాఖ జిల్లాలో ఎవరి ధీమా వారిది

రాత్రంతా జాగారం

సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు కొనసాగిన ఈవీఎంల అప్పగింత

- పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు పోటెత్తడమే కారణం
- అరకులోయ ఎంపీ, పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాల ఈవీఎంలను వేర్వేరుగా స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచిన అధికారులు
- విజయవంతంగా పోలింగ్ నిర్వహించడంపై సిబ్బందికి అధికారుల అభినందనలు

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

పోలింగ్ రోజు సోమవారం రాత్రి సైతం ఎన్నికల సిబ్బంది, అధికారులకు జాగరం తప్పలేదు. గతంలో పోలింగ్ రోజు ఏదో సమయంలో ఈవీఎంలను అప్పగించడం, అదే రోజు అర్ధరాత్రి ఈవీఎంలను స్ట్రాంగ్ రూముల్లో భద్రపరచడం జరిగేది. కానీ ఈసారి అందుకు భిన్నంగా సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ సమయం అయినప్పటికీ అధిక సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడంతో పలు కేంద్రాల్లో రాత్రి తొమ్మిది గంటల వరకు పోలింగ్ నిర్వహించిన పరిస్థితులున్నాయి. పాడేరు అసెంబ్లీ స్థానం పరిధిలో 318, అరకులోయ అసెంబ్లీ స్థానం పరిధిలోని 304



పాడేరు అసెంబ్లీ స్థానం ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌కు సీలు వేస్తున్న ఆర్వో భావన వశిష్ఠ, చిత్రంలో పరిశీలకుడు వివేకానందన్, కలెక్టర్ విజయసునీత

పోలింగ్ కేంద్రాల నుంచి మొత్తం ఈవీఎంలను జిల్లా కేంద్రం పాడేరులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లోనే భద్రపరచాల్సిన ఉంది. దీంతో ఆ రెండు అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని పాడేరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్లలోనే అప్పగించాల్సి ఉంది. దీంతో సోమవారం పోలింగ్ ముగిసిన తర్వాత నుంచి మంగళవారం తెల్లవారుజాము మూడు గంటల వరకు వివిధ ప్రాంతాల నుంచి ఎన్నికల సిబ్బంది ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని తీసుకువచ్చారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఈవీఎంలు, సామగ్రిని స్వీకరించి, వాటిని సరిచూసుకోవడం తదితర వ్యవహారాలతో



సోమవారం అర్ధరాత్రి పాడేరులోని రిసెప్షన్ సెంటర్‌లో ఎన్నికల సిబ్బంది హడావిడి

రాత్రంతా ఎన్నికల సిబ్బంది, అధికారులు నిద్రపోకుండానే ఆయా పనులు చేపట్టారు. మొత్తానికి మంగళవారం ఉదయం ఆరు గంటలకు మొత్తం ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి స్వీకరణ పూర్తయింది. ఎన్నికల సిబ్బంది ఆదివారం రాత్రి పోలింగ్ కేంద్రాలకు చేరుకుని సోమవారం రోజంతా పోలింగ్ నిర్వహించి, పోలింగ్ అనంతరం ఈవీఎంలు, సామగ్రి అప్పగింతకు రాత్రంతా పాడేరులో జాగరం చేశారు. ఈ మొత్తం ప్రక్రియలో పోలింగ్ సిబ్బంది జిల్లాలో ఎన్నికలను విజయవంతం చేసినందుకు గానూ సిబ్బందిని అధికారులు అభినందించారు.

ఎన్నికల పరిశీలకుడి సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లకు ఈవీఎంలు

పాడేరు, అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగిన పోలింగ్‌లో ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు చెందిన ఈవీఎంలను ఎన్నికల పరిశీలకుడు ... మిగతా 8వ పేజీలో

ఆకట్టుకున్న మోడల్ పోలింగ్ కేంద్రం

పాడేరు, మే 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఓ పోలింగ్ కేంద్రాన్ని మోడల్‌గా తీర్చిదిద్దాలని ఎన్నికల కమిషన్ సూచించింది. ఇందులో భాగంగా పాడేరులోని శ్రీకృష్ణాపురం(284) పోలింగ్ కేంద్రాన్ని బూత్ స్థాయి అధికారిణి జె.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో మోడల్‌గా తీర్చిదిద్దారు. పోలింగ్ కేంద్రం ఆవరణలో బెలూన్లతో అలంకరించడంతో పాటు అక్కడికి వచ్చే ఓటర్లకు తాగునీటి సదుపాయం, వేచి ఉండేందుకు ప్రత్యేకంగా టెంట్లు, వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఓట్లేసేందుకు వచ్చిన ఓటర్లకు ఈ పోలింగ్ కేంద్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కాగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత ఇదే పోలింగ్ కేంద్రంలో తన ఓటును వినియోగించుకున్నారు.



బెలూన్లతో అలంకరించిన పాడేరులోని శ్రీకృష్ణాపురం మోడల్ (284) పోలింగ్ కేంద్రం

ఓటింగ్ అంచనాల్లో టీడీపీ శ్రేణులు తలమునకలు

- పార్టీ శ్రేణులతో చర్చించిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిడ్డి ఈశ్వరి

పాడేరు, మే 14(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో స్థానిక అసెంబ్లీ నియోజకవర్గంలో తమ పార్టీకి ఎంత మేరకు ఓట్లు పడ్డాయి?, ప్రత్యర్థి పార్టీ, ఇతరులకు ఏయే చోట్ల ఎంత మేరకు ఓట్లు వేశారనే అంచనాలను రూపొందించే పనిలో టీడీపీ శ్రేణులు మంగళవారం నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలోని పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు మండలాలకు చెందిన టీడీపీ ముఖ్యనేతలతో గిడ్డి ఈశ్వరి సమావేశమయ్యారు. ఐదు మండలాలు, ఆయా పోలింగ్ కేంద్రాల వారీగా తమకు ఎన్ని ఓట్లు వస్తాయి?, ఇతర పార్టీలకు చెందిన అభ్యర్థులకు ఎంత మేరకు ఓట్లు పడతాయనే విషయాలను బూత్‌వారీగా చర్చించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో 318 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఒక్కో పోలింగ్ బూత్‌లో సగటున టీడీపీకి 200 చొప్పున ఓట్లు పడతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆ లెక్కన 318 బూత్‌ల్లో కలిపి మొత్తం 63,600 వరకు ఓట్లు టీడీపీకి వస్తాయని ఎమ్మెల్యే అభ్యర్థి గిడ్డి ఈశ్వరి, నియోజకవర్గంలోని టీడీపీ నేతలు, కార్యకర్తలు భావిస్తున్నారు. నియోజకవర్గంలో ఓటింగ్ శాతం సైతం గతంలో కంటే (63.9) పెరగడంతో పాటు జగన్ ప్రభుత్వంపై వ్యతిరేకత, టీడీపీ ఓటు బ్యాంకు తమకు పదిలంగా ఉండడం, వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వరరాజుకు చెందిన ఓట్లను కాంగ్రెస్ అభ్యర్థి సతకా బుల్లిబాబు, స్వతంత్ర అభ్యర్థి వంతాల సుబ్బారావు చీల్చుతారని, ఫలితంగా తమకు లాభిస్తుందని టీడీపీ శ్రేణులు అంచనాలు వేస్తున్నారు. ఐదు మండలాలకు చెందిన సంబంధించిన నేతలు తెలిపిన వివరాల ప్రకారం టీడీపీ విజయం సాధిస్తుందనే ధీమాను అభ్యర్థి గిడ్డి ఈశ్వరి, నేతలు వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పి.గోవిందరావు, గంగపూజారి శివకుమార్, చల్లంగి లక్ష్మణరావు, రొబ్బి రాము, డప్పొడి వెంకటరమణ, బుద్ద జ్యోతికిరణ్, బుక్కా వెంకటేశ్, అల్లంగి సుబ్బలక్ష్మి, డి.శాంతికుమారి, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల సరళిపై టీడీపీ శ్రేణులతో చర్చిస్తున్న గిడ్డి ఈశ్వరి

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.5

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. భీమిలి				
2. విశాఖ తూర్పు				
3. విశాఖ పశ్చిమ				
4. విశాఖ ఉత్తరం				
5. విశాఖ దక్షిణం				
6. గాజువాక				
7. పెందుర్తి				
8. అనకాపల్లి				
9. యలమంచిలి				
10. పాయకరావుపేట				
11. నర్సీపట్నం				
12. చోడవరం				
13. మాడుగుల				
14. పాడేరు				
15. అరకు				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : పోర్టు హాస్పిటల్ ఎదురుగా, ఎన్.హెచ్.16, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-530016.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కొత్తూరు, మే 14 : పిసినికాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్టు అనకాపల్లి రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపారు. విశాఖపట్నం మల్కాపురం ప్రాంతానికి చెందిన రేఖా రాజేష్ (38) సోమవారం ఓటు వేసేందుకు అనకాపల్లి వచ్చాడు. అక్కడి నుంచి కశింకోట మండలం తాళ్లపాలెంలోని అత్తగారింటికి వెళ్లాడు. అక్కడి నుంచి మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో తిరిగి బావమరిది మాడెం శ్రీనివాసరావుతో మల్కాపురం వెళ్లేందుకు బయలుదేరారు. మార్గ మధ్యలో పిసినికాడ వద్ద గల కనకదుర్గమ్మ గుడి వద్ద సడన్‌గా బ్రేక్ వేయడంతో ఇద్దరూ ద్విచక్రవాహనంపై నుంచి కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న రాజేష్ తలకు తీవ్రమైంది. దీంతో 108 అంబులెన్స్ సహాయంతో అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ చెప్పారు. మృతుడి బావమరిది శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడుకి భార్య సంతోషికుమారి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడు ఒక క్యాంటీన్‌లో పనిచేస్తున్నాడు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

అనకాపల్లి టౌన్, మే 14 : స్థానిక విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి సమీపంలో ఆటో జారిపడి ఒక మహిళ మృతి చెందినట్టు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం గాజువాకలోని టీజీఆర్ నగర్‌కు చెందిన కె. లక్ష్మి (44) తన కుమార్తె కోమలి, డ్వాక్రా మహిళలతో ఆటోలో తుమ్మపాల గ్రామానికి వచ్చింది. సాయంత్రం తిరిగి వెళుతున్న సమయంలో అండర్‌బ్రిడ్జి సమీపంలో వెనుక కూర్చున్న తల్లి లక్ష్మి ఒక్కసారిగా పడిపోయిందని కుమార్తె కోమలి తెలిపింది. తలకు బలమైన గాయం కావడంతో హుటాహుటిన చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారని తెలిపింది. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ ఎస్ఐ సోమశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

కొట్లాటలో 20 మందిపై కేసు

ఎస్.రాయవరం, మే 14: ఎన్నికల ప్రక్రియలో భాగంగా మండలంలోని కొత్త రేవుపోలవరం పోలింగ్ కేంద్రం వద్ద సోమవారం వైసీపీ సర్పంచ్ మల్లె లోవరాజు, మాజీ సర్పంచ్ చోడిపల్లి బంగారి ఇరు వర్గాల మధ్య జరిగిన కొట్లాటలో ఆ ఇద్దరితో పాటు 20 మందిపై కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ విభీషణ రావు తెలిపారు. కొట్లాటకు చెందిన వీడియో ఆధారంగా అందులో ఉన్నవారందరిపై కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు.

22న సింహాచలంలో నృసింహ జయంతి

సింహాచలం, మే 14: నృసింహస్వామి ఆవిర్భావ నక్షత్రం స్వాతిని పురస్కరించుకుని ఈనెల 22న నృసింహ జయంతిని, అదే రోజు ఆర్జిత స్వాతి నక్షత్ర హవనాన్ని నిర్వహించాలని వైదిక కమిటీ నిర్ణయించినట్టు సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి సింగాల శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈ మేరకు కార్యాచరణపై వైదిక, ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం రాత్రి ఆలయ కల్యాణ మండపంలో సమావేశమై సమగ్రంగా చర్చించారు. నృసింహ జయంతి, స్వాతి నక్షత్ర హవనం ఒకే రోజు జరపాల్సి ఉన్నందున ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న పాత కల్యాణ గ్రౌండ్స్‌లో హోమం నిర్వాహణకు ఏర్పాట్లు చేయాలని ఈఈ బి.రాంబాబును ఆదేశించారు. స్వాతి హోమంలో పాల్గొనదలచిన భక్తులు రూ.2500 చెల్లించి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాల్గొనేందుకు అవకాశం ఉందన్నారు. హోమం టికెట్లు సింహగిరిపై పీఆర్వో కార్యాలయం లేదా ఏపీ టెంపుల్స్‌ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందవచ్చు నన్నారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు దేవస్థానానికి చెందిన కృష్ణాపురం గోశాలలో నృసింహ జయంతిని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని అప్పన్నస్వామి కృపకు పాత్రులు కావాలన్నారు. సమావేశంలో ఏఈఓ ఎన్.ఆనందకుమార్, వీబీవీ రమణమూర్తి, కేకే రాజేంద్రకుమార్, నరసింహరాజు, ఈఈ డీజీ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

జూలో 21 నుంచి సమ్మర్ క్యాంపు

ఆరిలోవ, మే 14: ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో ఈనెల 21 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు రెండు విడతలుగా వేసవి శిబిరం నిర్వహించనున్నట్టు క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపులో పాల్గొనదలచిన వారు రూ.500 చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఐదు సంవంత్సరా వయసు నుంచి 18 సంవత్సరాల వయసు వరకు బాలబాలికలు ఈ శిబిరంలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఐదు నుంచి 11 సంవత్సరాల వయసు వారికి 21 నుంచి 25 తేదీ వరకు, 12 నుంచి 18 సంవత్సరాల వయసు వారికి 28 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు క్యాంప్ నిర్వహిస్తామన్నారు. ఇందులో ప్రధానంగా చిన్నారులకు కొత్త అనుభూతిని కలిగించేందుఉ వీలుగా వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వణ్య ప్రాణులు, బర్డ్‌వాచింగ్ తెలుసుకోవడం, గైడడ్ జూ టూర్, వణ్య ప్రాణులకు అందించే వైద్య చికిత్స, వాటికి ఏర్పాటు చేసిన సౌకర్యాలను వివరిస్తామన్నారు. జూ వెటర్నరీ ఆస్పత్రిని సందర్శించే అవకాశం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమాలు చిన్నారులకు విజ్ఞానాన్ని అందిస్తాయని ఉత్సా హవంతులు 9440810213 నంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

17 నుంచి రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు

అనకాపల్లి టౌన్, మే 14 : స్థానిక గవరపాలెం వీవీ రమణ రైతు భారతిలో ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు మూడో రాష్ట్ర స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహించనున్నట్టు జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ కార్యదర్శి పీసీహెచ్. నాయుడు తెలిపారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు సౌజన్యంతో 1974-75 ఎంహెచ్ స్కూల్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం ఆరు గంటలకు నాటిక ప్రారంభిస్తామన్నారు. 17న గుంటూరు వారి నీలోనా నీవే, అమృతహస్తం నాటికలు ప్రదర్శింపబడతాయన్నారు. 18న విజయవాడ వారిచే బంధం, నెల్లూరు వారిచే నాన్న బంగారం, 19న విశాఖ వారి కాశీవాసీ రావయ్య, విజయవాడ వారి మనఃసాక్షి నాటికలు ప్రదర్శింపబడతాయని తెలిపారు. ఆదేరోజు విశాఖపట్నం వారిచే అనగనగా ఒకరోజు నాటిక ప్రత్యేక ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ నాటిక పోటీలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

డబుల్ రైల్వే లైను నిర్మాణ పనులను తనిఖీ



లక్ష్మీపూర్ రోడ్డు వద్ద రైల్వే పనులు పరిశీలిస్తున్న డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్

విశాఖపట్నం, మే 14: వాల్తేరు డివిజన్ పరిధిలోని లక్ష్మీపూర్ రోడ్డు, సింగారం, టికిరి మధ్య 21.750 కి.మీ మేర జరుగుతున్న డబ్లింగ్ లైను నిర్మాణ పనులను డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. డబ్లింగ్ లైను ప్రాజెక్టులో భాగంగా కొత్తగా వేసిన పట్టాలు, వంతెనలు, 25టీ యాక్సిస్ లోడ్‌కు అనుగుణంగా నిర్మించిన వంపులను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన స్పీడ్‌ట్రయిల్ విజయవంతమై పూర్తిస్థాయిలో రైళ్ల రాకపోకలను అనుమతి లభించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. డ బ్లింగ్ ప్రాజెక్టులో భాగంగా స్టేషన్ యార్డుల వద్ద కొత్త క్రాస్ ఓవర్లు, హై లెవెల్ ప్లాట్‌ఫామ్‌లు, బ్రిడ్జిలు నిర్మించారు. ఈ పర్యటనలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఏజీ.శ్రీనివాస్, చీఫ్ ఎలక్ట్రిల్ ఇంజనీర్ ఎం.నన్నాన్‌వాలా, చీఫ్ బ్రిడ్జి ఇంజనీర్ వీఎస్‌కే. రాజ్‌కుమార్, చీఫ్ ఇంజనీర్ కన్‌స్ట్రక్షన్స్ అశోక్‌కుమార్, ఏడీఆర్ఎం సుధీర్‌కుమార్ గుప్తా, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	130.00
లైవ్ ధర	150.00
విత్ స్కిన్	270.00
స్కిన్ లెస్	280.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

అంచనాల్లో అభ్యర్థులు

- పోలింగ్ ముగియడంతో సమీక్షలు
- నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు
- తమకు 30 వేల మెజారిటీ ఖాయమంటున్న గంటా వర్గం
- అదే మెజారిటీ తమకు వస్తుందంటున్న ముత్తంశెట్టి
- 'తూర్పు'లో గెలుపుపై ఇరువురు అభ్యర్థుల్లోనూ ధీమా
- 30 వేల మెజారిటీ వస్తుందంటున్న 'నార్త్' కూటమి అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు
- లక్షకు పైగా ఓట్లు వస్తాయంటున్న వైసీపీ అభ్యర్థి కేకే రాజు
- పార్టీ కేడర్‌కు గణబాబు పార్టీ
- విజయంపై ఆడారి ఆనంద్ విశ్వాసం
- మంచి మెజారిటీ వస్తుందంటున్న గాజువాక టీడీపీ అభ్యర్థి పల్లా
- 40 వేల మెజారిటీ: 'సౌత్' కూటమి అభ్యర్థి వంశీకృష్ణ
- బీచ్‌లో ఫ్యామిలీతో శ్రీభరత్ రిలాక్స్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పోలింగ్ ముగిసింది. ఓటింగ్ శాతం కాసింత పెరిగింది. ఇది ఎవరికి లాభం?, ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయి?, ఏ అభ్యర్థి ఎంత మెజారిటీతో గెలుస్తారు?...ఇప్పుడు ఎక్కడ చూసినా ఇవే చర్చలు. దాదాపు మూడు నెలల నుంచి అభ్యర్థులు కూడా విశ్రాంతి లేకుండా పార్టీ కార్యక్రమాలు, ప్రచారాల్లో మునిగిపోయారు. రాత్రి, పగలు తేడా లేకుండా కేడర్‌తో కలిసి పనిచేశారు. సోమవారం రాత్రి 12 గంటల తరువాత కంటి నిండా కునుకు తీశారు. మళ్లీ మంగళవారం ఉదయం నుంచి చాలామంది పార్టీ కేడర్‌తో కూర్చొని గెలుపు, ఓటములపై సమీక్షలు ప్రారంభించారు. మండలం, గ్రామం, వార్డుల వారీగా పోలింగ్ ఎలా జరిగింది?, ఎక్కడ పార్టీకి ఎక్కువ ఓట్లు పడ్డాయి?...అనే అంశాలపై నాయకులు, కార్యకర్తల నుంచి సమాచారం అడిగి తెలుసుకున్నారు. మొత్తంగా చూసుకుంటే ఎవరికి విజయం దక్కుతుంది?, ఎంత మెజారిటీ వస్తుంది? అనే అంశాలపై ప్రతి ఒక్కరూ లెక్కలు వేసుకున్నారు. కొందరు తమదే విజయమన్న ధీమాతో ఉన్నారు.

విశాఖపట్నం టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ కుటుంబంతో కలిసి ఆర్కే బీచ్‌కు వెళ్లి సేదతీరారు. వైసీపీ తరపున పోటీ చేసిన బొత్స ఝాన్సీలక్ష్మి భర్త సత్యనారాయణతో కలిసి పార్టీ సమావేశంలో పాల్గొన్నారు. గెలుస్తామనే విశ్వాసం వ్యక్తంచేశారు.

భీమిలి నియోజకవర్గంలో ప్రధాన అభ్యర్థులు ఇద్దరు ఎవరి పార్టీ కార్యాలయంలో మండల, గ్రామ, వార్డు నాయకులతో సమావేశమయ్యారు. ఆయా ప్రాంతాల వారీగా ఎంత మెజారిటీ వస్తుందో గంటా శ్రీనివాసరావు స్వయంగా రాసుకున్నారు. వేయి ఓట్ల మెజారిటీ వస్తుందని నాయకులు చెబితే...అందులో సగమే 500గా రాసుకున్నారు. అలా చూసుకుంటే 30 వేల ఓట్ల మెజారిటీతో గెలుస్తామని ఆయన అనుచరులు తెలిపారు. ఇక వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కూడా పార్టీ కార్యాలయంలో అందరితో సమావేశమై సమీక్షించుకున్నారు. తనకు 30 వేల ఓట్ల మెజారిటీ వస్తుందని తెలిపారు.

తూర్పు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు, వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఇద్దరూ పోటాపోటీగా ప్రచారం చేశారు. ఓటర్లను ఆకట్టుకోవడంలో కూడా పోటీ పడ్డారు. ఓటింగ్ కూడా బాగానే చేయించుకున్నారు. వెలగపూడి నాలుగోసారి విజయం ఖాయమని చెబుతుండగా, ఆయన వర్గీయులు మంచి మెజారిటీ వస్తుందంటున్నారు. ఇకపోతే వ్యాపారాలన్నీ పక్కనపెట్టి గత మూడు నెలలుగా ఎలా గెలవాలి? అనే అంశాలపైనే కసరత్తు చేసిన ఎంవీవీ వర్గం తాము తప్పకుండా గెలుస్తామని చెబుతున్నారు. పది వేల వరకు మెజారిటీ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఆయన తిరుమల వెళ్లినట్టు సమాచారం.

పశ్చిమ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి పెతకంశెట్టి గణబాబు విజయం తనదేనని ధీమాలో ఉన్నారు. మంగళవారం ఉదయం అంతా సమీక్షలు చేసుకొని సాయంత్రం నాయకులు, కార్యకర్తలు అందరినీ ఇంటికి పిలిపించుకొని కష్టపడి ఎన్నికల్లో పనిచేసిందుకు కృతజ్ఞతలు తెలిపి, వారికి విందు ఏర్పాటుచేశారు. వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ విజయంపై విశ్వాసంతో ఉన్నారు. తమకు కనీసం 20 వేల మెజారిటీ వస్తుందని ఆ పార్టీ వర్గీయులు చెబుతున్నారు.

విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ఎవరికి వారే ధీమా వ్యక్తంచేస్తున్నారు.



టీడీపీ నాయకులు ఇచ్చిన లెక్కలను చూస్తున్న గంటా శ్రీనివాసరావు

కూటమి అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు తనకు 30 వేల నుంచి 35 వేల ఓట్ల మెజారిటీ వస్తుందని నమ్మకం ఉందన్నారు. వైసీపీ అభ్యర్థి కేకే రాజు అయితే తాను ముందు నుంచి 1.1 లక్షల ఓట్లను సాధించాలనే టార్గెట్‌తో పనిచేశానని వివరించారు. నియోజకవర్గంలో 1.86 లక్షల ఓట్లు ఉండగా, వైసీపీకి లక్ష ఓట్లు దాటి తెచ్చుకోవాలని కష్టపడ్డామని, బూత్‌ల వారీగా సమీక్షించినప్పుడు లక్ష్యానికి చేరువలో ఉన్నామని తేలిందన్నారు.

విశాఖ దక్షిణ నియోజకవర్గంలో కూటమి తరపున పోటీ చేసిన జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్ 30 వేల నుంచి 40 వేల ఓట్ల మెజారిటీతో గెలుస్తానని విశ్వాసం వ్యక్తంచేశారు. విజయంపై ఎటువంటి అనుమానం లేదని, అందుకే చాలారోజుల తరువాత కుటుంబంతో కలిసి ఇంట్లోనే ఉన్నానన్నారు. వైసీపీ అభ్యర్థి వాసుపల్లి గణేశ్‌కుమార్ మూడోసారి కూడా గెలుస్తాననే నమ్మకంతో ఉన్నారు.

గాజువాకలో టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు జిల్లాలో అందరి కంటే ఎక్కువ మెజారిటీతో గెలుస్తారని ప్రచారం జరుగుతోంది. అక్కడ పోలైన ప్రతి వంద ఓట్లలో 60-65 ఓట్లు ఆయనకే పడ్డాయనే ప్రచారం జరుగుతోంది. పల్లా శిబిరం కూడా అదే అంచనాలతో ఉంది. వైసీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ వర్గం ఎక్కడా పెదవి విప్పడం లేదు.

పెందుర్తిలో కూటమి తరపున పోటీ చేసిన జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు విజయంపై చాలా ధీమాగా ఉన్నారు. వైసీపీ ప్రభుత్వంపైనా, అభ్యర్థిపైనా ఉన్న ప్రజా వ్యతిరేకతే తమకు ప్లస్ పాయింట్‌గా మారిందని, ఇంకా కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ఎక్కువ ఓట్లు వచ్చేందుకు దోహదపడ్డాయన్నారు. మంచి మెజారిటీతో గెలుస్తామన్నారు. వైసీపీ అభ్యర్థి అదీప్‌రాజ్ వర్గం మెజారిటీ ముఖ్యం కాదని, గెలవడం ఖాయమనే విశ్వాసం వ్యక్తం చేస్తోంది.

తుమ్మపాలలో అధ్వానంగా పారిశుధ్యం

- వీధుల్లో పేరుకుపోయిన చెత్తా, చెదారాలు
- దుర్వాసనతో అవస్థలు పడుతున్న గ్రామస్థులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

తుమ్మపాల, మే 14 : అనకాపల్లి మండలం మేజరు పంచాయతీ తుమ్మపాలలో ఏ మూలన చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. రోజుల తరబడి చెత్తకుప్పలు నిల్వ ఉండిపోతుండడంతో దుర్వాసన వచ్చి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ చెత్త శునకాలు, పందులు స్వైర విహారం చేస్తూ మరింత రోత పుట్టిస్తున్నాయి. పలు సందర్భాల్లో పంచాయతీ అధికారులకు గ్రామస్థులు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

తుమ్మపాల మేజరు పంచాయతీలో 18 వార్డులుండగా దాదాపు 20వేల మంది జనాభా నివాసం ఉంటున్నారు. దాదాపు అన్ని వార్డుల్లో ఎక్కడికక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. రోజుల తరబడి నిల్వ ఉండిపోవడంతో దుర్వాసన వస్తున్నది. మాంసం, కూరగాయలు, చేపల వ్యర్థాలు వేస్తుండడంతో అవి కుళ్లి దుర్వాసన రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీధుల్లో సంచరించాలంటే ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన దుస్థితి దాపురించింది. స్థానికంగా నివాసం ఉంటున్న వారు దుర్వాసనకు ఇళ్లల్లో ఉండలేక నానా అవస్థలు పడుతున్నారు. దోమలు రాత్రి వేళల్లో స్థానికులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పలు సందర్భాల్లో స్థానికులు పంచాయతీకి ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.



సచివాలయం-1 వద్ద చెత్తలో శునకాల స్వైర విహారం



తుమ్మపాల మెయిన్‌రోడ్డులో భారీగా పేరుకుపోయిన చెత్త

డివైడర్లపై కూడా చెత్త

తుమ్మపాల మెయిన్‌రోడ్డు సైతం చెత్తకుప్పలకు నిలయంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా నివాసం ఉంటున్న వారు, వ్యాపార సముదాయాలు నిర్వహించుకునే వారు చెత్తను నేరుగా తీసుకువచ్చి డివైడర్లపై పడేస్తున్నారు. దీంతో శునకాలు, పందులు డివైడర్లపై స్వైరవిహారం చేస్తూ ప్రయాణికులకు, పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. నివారించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. స్వచ్ఛ తుమ్మపాలగా తీర్చిదిద్దుతామన్న నాయకుల హామీలు అటకెక్కాయని పలువురు విమర్శిస్తున్నారు.



తుమ్మపాల వీధిలో భారీగా పేరుకుపోయిన చెత్త

పారిశుధ్య కార్మికుల కొరతతో ఇబ్బంది

తుమ్మపాలలో పారిశుధ్య కార్మికుల కొరత ప్రజలకు శాపంగా మారింది. 20వేల మంది జనాభా కలిగిన తుమ్మపాలలో 23 మంది కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు, ముగ్గురు పర్మినెంట్ కార్మికులు పనిచేస్తున్నారు. దీంతో వార్డుల్లో చెత్తను తరలించేందుకు వారం రోజులకు పైగా పడుతున్నది. దీనికితోడు ఇటీవల జరిగిన ఎన్నికల విధులకు తుమ్మపాల పంచాయతీ నుంచే పారిశుధ్య కార్మికులను తరలించడంతో వారం రోజులుగా తుమ్మపాలలో పారిశుధ్యం లోపించింది. పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ ఉన్నప్పటికీ అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదు.

ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం



సందిన చినబాబు, తుమ్మపాల

తుమ్మపాలలో రోజుల తరబడి చెత్త నిల్వలు పేరుకుపోయి ఉండిపోతుండడంతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం. భయంకరంగా దుర్వాసన వెదజల్లుతుండడంతో నిత్యం తలుపులు మూసుకుని ఉండాల్సి వస్తుంది. పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదులు చేసినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. తక్షణమే సమస్యను పరిష్కరించాలి.

ఎలమంచిలిలో అస్తవ్యస్త డ్రైనేజీలు

- కొన్నిచోట్ల మూసుకుపోయిన వైనం
- మరికొన్నిచోట్ల పూడికతో నిండిపోయాయి..
- ఫలితంగా రోడ్లపైనే మురుగు నీరు
- ఏళ్ల తరబడి పట్టించుకోని పాలకులు,అధికారులు

ఎలమంచిలి, మే 14 : పంచాయతీ నుంచి మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ అయితే సౌకర్యాలు, వసతులు ఉంటాయని ఆశించిన పట్టణ ప్రజలకు నిరాశే మిగిలింది. ముఖ్యంగా మునిసిపాలిటీలో డ్రైనేజీ సమస్య జనాలను వేధిస్తోంది. విస్తరణ లేకపోయినప్పటికీ ఉన్న రోడ్లపై మురుగు నీరు ప్రవహించడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మునిసిపాలిటీలో డ్రైనేజీ సమస్యతో అన్నివర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరణ చేస్తారని భావించిన ప్రజలకు ఏళ్ల తరబడి నిరాశే మిగులుతోంది. ఫలితంగా పలుచోట్ల రోడ్లపైనే మురుగు నీరు తాండవిస్తోంది. అధికారులు, పాలకులు పట్టించుకోక పోవడంతో డ్రైనేజీలు మూసుకుపోయాయి. దీంతో పట్టణంలో చాలా మేరకు పల్లె వాతావరణమే కనిపిస్తున్నది. డ్రైనేజీల్లో పూడిక తీయకపోవడం, యానాద్రి కాలువ ఆధునికీకరణకు నోచుకోకపోవడంతో పట్టణ ప్రజలకు డ్రైనేజీ కష్టాలు తీరడం లేదు. ఫలితంగా యానాద్రి కాలువ దోమల ఆవాసకేంద్రంగా మారింది. విలీన వార్డుల్లో సైతం డ్రైనేజీ వ్యవస్థ ఆధునికీకరణకు చర్యలు తీసుకోకపోవడంతో రోడ్లపైనే వాడుక నీరు ప్రవహిస్తోంది. పట్టణంలో పెదపల్లి రోడ్డు, పరమేశ్వరి థియేటర్ వద్ద డ్రైనేజీ పూడుకుపోయినా అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. కట్టుపాలెం విలీన వార్డులో ప్రధాన రోడ్డుపైనే వాడుక నీరు పిల్ల చెరువును తలపించేలా ఉంది. అయినా మునిసిపాలిటీ ఇంజనీరింగ్, ప్రజారోగ్య శాఖ అధికారులకు ఇవేమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. పట్టణ స్థాయి పన్నులు చెల్లిస్తూ మౌలిక సదుపాయాలు లేకపోవడం పట్ల ఎలమంచిలి మునిసిపాలిటీ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం పూడిక తీయించాలనే ఆలోచన కూడా అధికారులు రాకపోవడం గమనార్హం. ఇప్పటికైనా పట్టణ ప్రజలు ఎదర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గాల చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



మునిసిపాలిటీ విలీన వార్డు కట్టుపాలెంలో రోడ్డుపైనే మురుగు నీరు



పట్టణంలోని పెదపల్లి రోడ్డు వద్ద పూడుకుపోయిన డ్రైనేజీని పట్టించుకోని అధికారులు

పెందుర్తిలో ఈదురుగాలుల బీభత్సం

- పలుచోట్ల నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, విరిగిపడిన చెట్లు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెందుర్తి, మే 14: పెందుర్తిలో సోమవారం రాత్రి కురిసిన కురిసిన భారీ వర్షానికి బలమైన ఈదురుగాలులు తోడవ్వడంతో విద్యుత్ శాఖకు అపారమైన నష్టం వాటిల్లింది. గాలుల బీభత్సానికి పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో పాటు చెట్లు స్తంభాలపై పడిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు నాలుగు గంటల పాటు అంతరాయం వాటిల్లింది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సంబంధిత సిబ్బంది రాత్రింబవళ్లు శ్రమించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షం కారణంగా మండంలోని సరిపల్లి, గుర్రమ్మపాలెం, అక్కిరెడ్డిపాలెం, రాజయ్యపేట, వాలిమెరకల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలపై తాటిచెట్లతో పాటు పలు చెట్లు విరిగిపడడంతో వైర్లు తెగిపోవడంతో ముందస్తు జాగ్రత్తగా అధికారులు కరెంటు సరఫరాను నిలిపివేశారు. దీంతో సోమవారం రాత్రి ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో సిబ్బంది ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో విద్యుత్ శాఖ ఏఈ బి.రవి, లైన్‌మన్ బి.నాయుడు, కాంట్రాక్టర్ జయసింహ ఆధ్వర్యంలో ఇరవై మంది సిబ్బంది యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. క్రేన్ సహాయంతో విద్యుత్ స్తంభాలపై పడిన చెట్లను తొలగించారు.

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమికి విజయం తథ్యం

- లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ



సమావేశంలో మాట్లాడుతున్న లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బాబ్జీ

కొత్తూరు, మే 14: రాష్ట్రంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి విజయం తథ్యమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలంతా ఓటు వేసేందుకు ఎండలో సైతం వచ్చారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు పొద్దుపోయినా ఓపికగా తమ ఓటును వినియోగించుకున్నారని చెప్పారు. ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకొని ఉత్సాహంగా ఓటు వేశారన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు కరణం నాగేశ్వరరావు, కొమ్మూరి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది..

- జనసేన నాయకుడు కొణతాల రామకృష్ణ

కొత్తూరు (అనకాపల్లి), మే 14 : సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో తప్పనిసరిగా కూటమి ప్రభుత్వం విజయం సాధించి అధికారంలోకి వస్తుందని జనసేన నాయకుడు కొణతాల రామకృష్ణ ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మార్పు రావాలని ప్రజలంతా బహిరంగంగానే కూటమికి మద్దతు ప్రకటించారన్నారు. రాత్రి ఒంటి గంట అయినా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఉన్నారంటే తీర్పు ఏ విధంగా ఉండబోతుందో ఊహించవచ్చునన్నారు. కూటమికి మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే కూటమి అధికారంలోకి రాగానే ప్రజల ఆకాంక్షల మేరకు సంక్షేమం అభివృద్ధి చెందడానికి రానున్న ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

అనకాపల్లిలో 79.8శాతం ఓట్లు నమోదయ్యాయని, వీటితో పోస్టల్ బ్యాలెట్ కలిపి ఫలితాలను జూన్ 4న వెలువడనున్నాయని చెప్పారు.

మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి ప్రధానమంత్రిగా మోదీ రాబోతున్నారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు కావడం ఖాయమన్నారు. పదేళ్లుగా పవన్ కల్యాణ్ ప్రజాజీవితంలో ఉంటూ చేసిన పోరాటాలకు ఫలితం దక్కనుందన్నారు. అనంతరం టీడీపీ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు మాట్లాడుతూ రామకృష్ణ వంటి వ్యక్తులను అభ్యర్థిగా నిర్ణయించడం వల్ల ఎటువంటి ఇబ్బందులు కలగలేదన్నారు.

సమన్వయంతో పోల్ మేనేజ్‌మెంట్ సజావుగా సాగిందన్నారు. ఈ సమావేశంలో బొడ్డేడ జోగినాయుడు, శ్రీరామదాసు గోవింద, తాడి రామకృష్ణ, మంగా ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, **KONDAPALLI HEMALATHA** (Old Name), W/o. Kondapalli Sivateja, resident of 27-3-151, Road No.5, Srinagar, Official Col, Gajuwaka, Visakhapatnam. Change my name from **KONDAPALLI HEMALATHA** (Old Name) to **MUKKA HEMALATHA** (New Name). Hence forth I am being called as **MUKKA HEMALATHA** (New Name), W/o. Kondapalli Sivateja for all purposes.
AJV_192816

VEHICLES FOR SALE

★ **AP39 TV 4053** MAHINDRA BOLERO PIK-UP FB PS 1.7T XL MODEL-2021; **AP35 W 2476** ASHOK LEYLAND 3116IL 8x2 BSIII MODEL 2012; **AP39 QZ 6126** HONDA ACTIVA 6G MODEL 2022; Kanakadurga Finance Ltd, Narsipatnam, Cont.: **9959802666**
AJV_183373

For Advertisement Contact :
9963231176
9966165093

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటి

మన్యంలో పెరిగిన పోలింగ్ శాతం



కొయ్యూరు మండలం చింతలపూడి పోలింగ్ బూత్‌లో చాంతాడంత క్యూలో నిరీక్షిస్తున్న ఓటర్లు



పాడేరు మండలంలోని డి.గొందూరు పోలింగ్ కేంద్రం వద్ద బారులుతీరిన మహిళా ఓటర్లు

అన్ని మండలాల్లోనూ ఎన్నికలు ప్రశాంతం

పాడేరులో గత ఏడాది 71.03 శాతం నమోదు.. ఈసారి 72.53 శాతం ఓటింగ్

మండలంలో 43,778 మంది ఓటర్లలో 31,755 మంది ఓటు హక్కు వినియోగం

పాడేరు ఏజెన్సీలో పోలింగ్ శాతం పెరిగింది. గత ఎన్నికల కంటే ఈసారి ఎక్కువైంది. అలాగే అన్ని మండలాల్లోనూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలోని 67 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం రాత్రి 7 గంటల వరకు సాగిన పోలింగ్‌తో 72.53 శాతం నమోదైంది. గత ఎన్నికలతో పోల్చుకుంటే ఈసారి ఓటింగ్ శాతం పెరిగినట్లయింది. గత ఎన్నికల్లో 71.03 కాగా, ఈసారి 72.53 శాతంగా నమోదైంది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రంగా ఉండడంతో పోలింగ్ కేంద్రానికి వచ్చేందుకు ఓటర్లు వెనుకడుగు వేసినప్పటికీ, మధ్యాహ్నం 2 గంటల తరువాత పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు.

పాడేరు రూరల్, మే 14: పాడేరు మండలంలో 43,778 మంది ఓటర్లకుగాను 31,755 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. బడిమెల పోలింగ్ కేంద్రంలో 978 మందికిగాను 742 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదే విధంగా లింగాపుట్టులో 766 మందికి 666 మంది, గొండెలిలో 863కి 652, జి.బొడ్డాపుట్టులో 208కి 154, ఇరడాపల్లిలో 1,007కి 756, రాయిగెడ్డలో 215కి 183, వై.సొలముల్లో 831కి 690, డోకులూరులో 573కి 439, దేగలవీధిలో 369కి 300, దుమ్మాపుట్టులో 311కి 281, బంట్రోతుపుట్టులో 467కి 382, కించూరులో 302కి 249, తోటలగొందిలో 429కి 367, జి.ముంచంగిపుట్టులో 538కి 466, కొత్తపల్లిలో 357కి 288, గుత్తులపుట్టు(267)లో 796కి 648, పనసపల్లిలో 670కి 562, గుత్తులపుట్టు(269)లో 407కి 358, నడిమివీధిలో 988కి 797, తలారిసింగిలో 932కి 621, గడివలసలో 599కి 505, గుడివాడ(273)లో 1,018కి 487, గుడివాడ(274)లో 1,123కి 493, పాడేరు(275)లో 1,062కి 528, గుడివాడ(276)లో 761కి 350, పాడేరు(277)లో 786కి 421, పాడేరు(278)లో 780కి 385, పాడేరు (279)లో 767కి 384, డి.గొందూరులో 971కి 752, సుండ్రుపుట్టు(281)లో 871కి 426, సుండ్రుపుట్టు(281)లో 801కి 409, పాతపాడేరులో 1,064కి 645, శ్రీకృష్ణాపురంలో 1,167కి 672, లగిశపల్లిలో 893కి 664, గురుపల్లిలో 543కి 407, వంజంగిలో 809కి 686, కొత్తవలసలో 499కి 410, కిండంగి(289)లో 669కి 476, కిండంగి(290)లో 635కి 446, కాడెలిలో 644కి 487, వనుగుపల్లిలో 1,187కి 866, బంగారుమెట్టలో 1,110కి 773, కుజ్జెలిలో 676కి 554, డి.మోదాపుట్టులో 451కి 375, ఎగువమోదాపుట్టులో 420కి 353, తుంపాడలో 897కి 714, వంతాడపల్లిలో 385కి 323, వనుగురాయిలో 523కి 448, మినుములూరులో 1,158కి 835, వంట్లమామిడిలో 847కి 684, చోడిపల్లిలో 551కి 454, కొత్తపాలంలో 360కి 310, మల్కపాలంలో 567కి 492, మోదాపల్లిలో 671కి 561, దేవాపురంలో 806కి 627, కందులపాలెంలో 351కి 304, తుమ్మలపాలెంలో 122కి 92, తరగంలో 536కి 401, ఐనాడలో 1,130కి 767, జంగిడాపల్లిలో 417కి 298, సలుగు(312)లో 791కి 504, కక్కిలో 361కి 271, సలుగు(314)లో 639కి 420, చిలకలగొందిలో 328కి 233, రెళ్లమామిడిలో 110కి 105, డల్లాపల్లిలో 202కి 167, లోలంగిపాడు పోలింగ్ కేంద్రంలో 220 మంది ఓటర్లకుగాను 181 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

కొయ్యూరులో పెరిగిన ఓటింగ్

గత ఎన్నికల్లో 61 శాతం.. తాజాగా 67.14 శాతం నమోదు

కొయ్యూరు, మే 14: మండలంలో ఓటింగ్ శాతం పెరిగింది. గత ఎన్నికలతో పోల్చితే ఈసారి ఓట్లు పెరగడంతో పాటు ఓటింగ్ శాతం కూడా ఎక్కువైంది. గత ఎన్నికల్లో 61 శాతం నమోదు కాగా, ఈసారి 67.14 శాతానికి పెరిగింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో మండల వ్యాప్తంగా 41,024 ఓట్లు ఉన్నాయి. అప్పటి ఎన్నికల్లో 13,248 పురుషులు, 14,031 మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 61 శాతం పోలింగ్ నమోదైంది. ప్రస్తుత ఎన్నికల్లో మండలంలోని ఓటర్ల సంఖ్య 43,178 పెరిగింది. ఈ ఎన్నికల్లో 29,001 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 67.14 శాతం మేర ఓటింగ్ నమోదైంది. 13,571 మంది పురుషులు, 15,430 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. గతంతో పోలిస్తే 326 మంది పురుషులు, 1399 మహిళలు ఈ ఎన్నికల్లో అదనంగా ఓటు వేశారు.



అరకు మండలంలోని బొసుబెడ్డ బూత్‌లో మండుటెండలో క్యూలో ఉన్న మహిళా ఓటర్లు

బూత్‌ల వారీగా ఓటింగ్ ఇలా...

గత ఎన్నికల్లో అప్పటి పరిస్థితుల దృష్ట్యా మారుమూల అత్యంత మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన ఎం.భీమవరం, యు.చీడిపాలెం, బూదరాళ్ల, మంప పంచాయతీల్లో 12 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. వీటిలో ఎం.భీమవరం (పోలింగ్ కేంద్రం నంబరు79)లో 777 ఓట్లకుగాను 449 పోలయ్యాయి. ఇదే పంచాయతీకి చెందిన పీఎల్ కొత్తూరు-82లో 343కు 173 ఓట్లు పోలయ్యాయి. అలాగే యు.చీడిపాలెంలోని పోలింగ్ స్టేషన్-72లో 613కు 372, రేవులకోట-80లో 608కు 269, పలకజీడి-81లో 583కు 435 ఓట్లు పోలయ్యాయి. అలాగే బూదరాళ్ల పంచాయతీకి సంబంధించి బూదరాళలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్-68లో 949 ఓట్లకు 363, పోలింగ్ బూత్-70లో 807కు 284, బూత్-71లో 445కు 149 ఓట్లు పోలయ్యాయి. అదే పంచాయతీలో చేరిన గరిమండ పోలింగ్ కేంద్రం-72లో 543కు 305, సాకులపాలెం-67లో 512కు 272, బాలరేవుల-69లో 272కు 141 ఓట్లు పోలయ్యాయి. మంప పంచాయతీకి సంబంధించి పోలింగ్ స్టేషన్-84లో 650 ఓట్లుకు 492, మరో బూత్-85లో 770 ఓట్లకు 545 ఓట్లు పోలయ్యాయి. ప్రస్తుత ఎన్నికల్లో సమస్యాత్మక మావోయిస్టు ప్రాబల్య పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన ఎం.భీమవరం, యు.చీడిపాలెం, బూదరాళ్ల, పంచాయతీల్లో పది పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. వీటిలో ఎం.భీమవరం-79లో 988 ఓట్లకు 577 పోలయ్యాయి. ఇదే పంచాయతీలోఇ పీఎల్ కొత్తూరు-82లో 413కు 216 పోలయ్యాయి. యు.చీడిపాలెం పంచాయతీలోని పోలింగ్ బూత్-83లో 585 ఓట్లకు 372, రేవులకోట-80లో 664 ఓట్లకు 344, పలకజీడి-81లో 686 ఓట్లకు 463 ఓట్లు పోలయ్యాయి. బూదరాళ్ల పంచాయతీ కేంద్రంలోని పోలింగ్ కేంద్రం-68లో 654 ఓట్లకు 265, బాలరేవుల-69లో 508 ఓట్లకు 346, గరిమండ-70లో 645 ఓట్లకు 275, కన్నవరం-72లో 493 ఓట్లకు 254, సాకులపాలెం-67లో 661 ఓట్లకు 376 ఓట్లు పోలయ్యాయి. గతంతో పోలిస్తే మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో ఓటర్లు సంఖ్య పెరిగింది. దీనికితోడు ఓటు హక్కు వినియోగించుకునే విషయంపై అవగాహన కలిగింది. మొత్తమ్మీద గతంలో జరిగిన ఎన్నికల్లో మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో నిర్వహించిన పోలింగ్‌లో వచ్చిన పోలింగ్ శాతం కంటే ప్రస్తుత ఎన్నికల్లో సుమారు మూడు శాతం మేరకు పెరిగింది.

అరకులోయలో 71.12 శాతం...

అరకులోయ: అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 71.12 శాతం పోలింగ్ నమోదైంది. గత ఎన్నికలతో పోలిస్తే ఈదఫా 1.12 శాతం పెరిగింది. నియోజకవర్గం పరిధిలోని మొత్తం ఓటర్లు రెండు లక్షల 45 వేల 489 మంది ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు లక్షా 19 వేల 429 మంది కాగా, మహిళా ఓటర్లు లక్షా 26 వేల 53, ఇతరులు ఏడుగురు ఉన్నారు. సోమవారం జరిగిన ఎన్నికలో మహిళలు 87,096 మంది, పురుషులు 87,491 మంది, ఇతరులు ఒకరు కలిసి మొత్తం లక్షా 74 వేల 588 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 71.12 శాతం ఓటింగ్ నమోదైంది.



మొదటిసారిగా ఓటు హక్కును వినియోగించుకున్న పాడేరు యువతీ, యువకులు

రాష్ట్ర సంక్షేమాన్ని కాంక్షించి ఓటు వేశాం..

» మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువత అభిప్రాయం

పాడేరు రూరల్, మే 14: రాష్ట్ర సంక్షేమాన్ని ఆకాంక్షించి మొట్టమొదటి సారిగా వచ్చిన ఓటు హక్కును సద్వినియోగించుకున్నామని యువ ఓటర్లు తెలిపారు. సోమవారం ఓటు వేసిన అనంతరం తురక వరలక్ష్మి (బీఎస్సీ), శనగన పార్థసారథి (బీఎస్సీ) ఎస్.హారిక దమయంతి (బీటెక్), యు. వెన్నెల శ్రవంతి (ఎంబీబీఎస్), యు.తరుణ్ (బిఫ్మాసీ) తదితరులు 'ఆంధ్రజ్యోతి'తో ఉత్సాహంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్న ఆలోచనతో మైదాన ప్రాంతంలో వివిధ కళాశాలల్లో విద్యను అభ్యసించే తాము ఓటు హక్కును సద్వినియోగం చేసుకొనేందుకు నివాస గ్రామం పాడేరు చేరుకొని మొట్టమొదటి సారిగా వచ్చిన ఓటును సద్వినియోగం చేసుకున్నామన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు.

చింతపల్లిలో కూటమికి మెజారిటీ ఓట్లు

» పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి లక్ష్మణరావు



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి లక్ష్మణరావు

చింతపల్లి, మే 14: మండలంలో మెజారిటీ ఓట్లు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి పడ్డాయని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు అన్నారు. లంబసింగి గ్రామంలో మంగళవారం టీడీపీ బూత్ ఏజెంట్లు, పార్టీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. పలు పోలింగ్ బూత్‌లలో వివిధ పార్టీలకు పడిన ఓట్లపై సమీక్షించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడేరు నియోజకవర్గంలోని చింతపల్లి మండలంలో అత్యధికంగా 63,130 ఉండగా, 78 పోలింగ్ కేంద్రాల్లో 40,902 ఓట్లు పడ్డాయన్నారు. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది ఓటింగ్ ఆరు శాతం పెరిగిందన్నారు. చింతపల్లి మండల కేంద్రంలో సుమారు రెండు వేల మంది ఓటు హక్కు వినియోగించుకోలేకపోయారని, బీఎల్‌వోలు ఓటరు స్లిప్పులు పంపిణీ చేయడంలో విఫలం కావడమే ఇందుకు కారణమని చెప్పారు. మండలంలో పది పోలింగ్ బూత్‌లలో మినహా 68 బూత్‌లలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఓట్లు పడ్డాయని, కూటమికి 18 వేల నుంచి 20 వేల మధ్యలో ఓట్లు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సరమండ శ్రీధర్, మంగు, పడాల్, పార్వతి, కృష్ణవేణి, నర్సీ రాములమ్మ పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధిలో భారీ వర్షం



భారీ వర్షంతో నీరు చేరిపోయి చెరువును తలపిస్తున్న జీకే వీధి బ్రిడ్జి

గూడెంకొత్తవీధి, మే 14: మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంది. అనంతరం రెండు గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణంలో భారీ మార్పు వచ్చింది. నల్లని మేఘాలు కమ్ముకున్నాయి. దీంతో మధ్యాహ్నం మూడున్నర గంటల వరకు ఎడతెరిపివ్వకుండా వర్షం కురిసింది. దీనివల్ల ప్రధాన రహదారల్లో నీరు చేరిపోయి వాగులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలు, చెరువులు వర్షపు నీటితో నిండిపోయాయి.

కాండంతొలుచు పురుగు నివారణపై దృష్టి

» ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ శివకుమార్



కాండంతొలుచు పురుగు

చింతపల్లి, మే 14: ఆదివాసీ రైతులు కాఫీ తోటల్లో కాండంతొలుచు తెల్ల పురుగు నివారణపై ప్రత్యేక దృష్టిసారించాలని ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ శివకుమార్ తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల కాండంతొలుచు పురుగు సమస్య కనిపిస్తున్నదన్నారు. ఇది రెక్కల పురుగుగా రూపాంతరం చెంది వేసవి సమయంలో ఎగిరే దశకు చేరుకుంటుందన్నారు. దీర్ఘకాలిక పొడి వాతావరణం, అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఈ పురుగు ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. ఈ సమస్య నివారణకు కాఫీ తోటలలో నీడ తగిన మోతాదులో ఉండేలా చూసుకోవాలని ఆయన సూచించారు. అలాగే మే నెలలో నీడ తగ్గించరాదన్నారు. ఈ పురుగు ఆశించిన మొక్కల కాండం బురడు చుట్టూ గుండ్రని ఉబ్బెత్తు వలయాలు ఏర్పడుతాయన్నారు. ఈ మొక్కలను నేల నుంచి అడుగున్నర ఎత్తుపై వరకు కాలర్ ప్రూనింగ్ పద్ధతి ద్వారా తొలగించాలన్నారు. పురుగు వేర్ల భాగంలోకి ప్రవేశించినట్టు గుర్తిస్తే మొక్కని తొలగించి కాల్చివేయాలన్నారు. ఇతర మొక్కలను ఈ పురుగు తాకిడి నుంచి కాపాడేందుకు కాండంపై వదులుగా ఉన్న బెరడును కొబ్బరి పీచుతో రుద్ది తొలగించుకోవాలన్నారు. అనంతరం పది శాతం సున్నపు ద్రావణం మొక్కల కాండం, దలసరి కొమ్మలకు పూతలాగా అద్దాలన్నారు. ఈ ద్రావణం 20 కిలోగ్రాములు సున్నంను 200 లీటర్లు నీటిలో కలుపుకున్న మిశ్రమంలో 200 గ్రాముల డీడీఎల్ ఫెవికాల్ కలుపుకొని సున్నపు ద్రావరణంగా తయారుచేసుకోవాలని ఆయన సూచించారు. రైతులు కాండం తొలుచు పురుగు ఉధృతిపై తక్షణమే స్పందించి నివారణ చర్యలు తీసుకోవాలని, లేదంటే కాఫీ తోటలకు తీవ్ర నష్టం కలుగుతుందని స్పష్టం చేశారు.

అవ్వకు అందని పింఛన్



పింఛన్ నిలిచిపోయిన వృద్ధురాలు పేరమ్మ

గూడెంకొత్తవీధి, మే 14: మండలంలోని దేవరాపల్లి పంచాయతీ కొట్నాపల్లి గ్రామానికి చెందిన 85 ఏళ్ల సాగిన పేరమ్మ నాలుగేళ్లుగా పింఛన్ అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.50 నుంచి పింఛన్ తీసుకుంటున్నానని, 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం తన పింఛన్ నిలిపివేసిందని చెప్పారు. పలుమార్లు గ్రామ సచివాలయం, మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తులు ఇచ్చినప్పటికీ పింఛన్ ఎందుకు ఆగిపోయిందో సమాధానం చెప్పడం లేదని, పింఛన్ అందక చాలా ఇబ్బందులు పడుతున్నానని అవ్వ పేరమ్మ వాపోయారు. ఇప్పటికైనా తన పింఛన్ ఇప్పించాలని ఆమె వేడుకున్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

డుంబ్రిగుడ, మే 14: అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవించింది. మండలంలోని గసభ పంచాయతీ మొగిరిగుడ గ్రామానికి పాంగి సుమిత్రకు మంగళవారం తెల్లవారు జామున పురిటి నొప్పులు వచ్చాయి. కుటుంబీకులు 108కు సమాచారం అందించారు. ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యంలో పురిటి నొప్పులు కావడంతో ఈఎంటీ జయంత్‌కుమార్ వైద్యం అందించారు. శిశువు అడ్డంగా ఉండడంతో కష్టతరమైన పరిస్థితిలో సుఖ ప్రసవాన్ని చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో ఆసుపత్రికి తరలించామని 108 వాహనం పైలట్ శ్యాం తెలిపారు.

88 మందికి వైద్య సేవలు

ముంచంగిపుట్టు, మే 14: మండలంలోని జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరంలో 88 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వారిలో జ్వరాలతో బాధపడుతున్న ఐదుగురిని గుర్తించి రక్త పరీక్షలను చేశారు. అలాగే ఇంటింటికీ వైద్య సిబ్బంది వెళ్లి రోగులను గుర్తించి అవసరమైన వైద్య సేవలను అందజేశారు. మలేరియా, టైఫాయిడ్, డయేరియా బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లబ్బూరు వైద్య సిబ్బంది తులసిరావు, భాగ్యవతి, క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన పార్టీలకు దీటుగా పోటీ

» స్వతంత్ర అభ్యర్థి వంతల సుబ్బారావు

చింతపల్లి, మే 14: పాడేరు నియోజకవర్గంలో ప్రధాన పార్టీలకు దీటుగా పోటీ ఇచ్చామని స్వతంత్ర్య అభ్యర్థి వంతల సుబ్బారావు చెప్పారు. మండల కేంద్రంలో తన మద్దతుదారులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తొలుత సీటు కేటాయించి, ఆఖరి నిమిషంలో రద్దు చేయడంతో కార్యకర్తలు, నాయకుల ఒత్తిడి మేరకు స్వతంత్రంగా పోటీ చేయాల్సి వచ్చిందన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు తన వెంట ఉంటూ తన గుర్తును గ్రామ స్థాయిలోకి తీసుకువెళ్లడం వల్ల ఓటింగ్ బాగా జరిగిందన్నారు. ఐదు మండలాల్లో ప్రధాన పార్టీలతో సమానంగా ఓటింగ్ పడిందన్నారు. తనకు మద్దతు ఇచ్చిన కార్యకర్తలు, ప్రజలకు రుణపడి ఉంటానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జీకే వీధి మండల అధ్యక్షుడు పాంగి చిరంజీవి, నాయకులు బొజ్జయ్య మొట్టడం బాలరాజు, గురుమూర్తి పాల్గొన్నారు.

ఏజెన్సీలో ప్రజల మద్దతుతోనే ప్రశాంతంగా ఎన్నికలు

» ఫలితాలు వచ్చేవరకు విద్వేషాలు వద్దు

» జి.మాడుగుల సీఐ రమేశ్



జి.మాడుగుల, మే 14: ప్రజల మద్దతుతోనే ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని జి.మాడుగుల సీఐ రమేశ్ చెప్పారు. మంగళవారం విలేకరులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాటాడుతూ ఎన్నికులకు ముందు మూడు నెలల నుంచే జి.మాడుగుల సర్కిల్ పరిధిలోని పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక కార్యచరణ రూపొందించి ప్రజలకు అవగాహన కల్పించామని చెప్పారు. ఆ దిశగా తమ సర్కిల్ పరిధిలోని మూడు స్టేషన్లకు సంబంధించి ప్రజలకు పూర్తిగా స్వేచ్ఛను కలిగించండంతో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకున్నారని పేర్కొన్నారు. ఈ మూడు మండలాల పరిధిలోని అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో 50 నుంచి 70 శాతం వరకు ఓట్లు నమోదు కావడం ఇదే ప్రథమమని సీఐ తెలిపారు. అలాగే ఈవీఎంలో ఓట్లు నిక్షిప్తమై ఉన్నందున ఫలితాలు వచ్చేవరకు ప్రజాలు విద్వేషాలకు పాల్పడవద్దని సూచించారు. అతని వెంట ఎస్‌ఐ శ్రీనివాసరావు ఉన్నారు.

70.2 శాతం పోలింగ్

...5వ పేజీ తరువాయి



డొంకరాయి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసు (ఫైల్)

పెంచాలనే లక్ష్యంతో అధికారులు సైతం కొంత వరకు ప్రచారం చేశారు. ఓటింగ్ విషయంలోనూ గిరిజనులు చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఏజెన్సీలో ప్రతి రోజు మధ్యాహ్నం తరువాత వర్షం కురుస్తుండడంతో ఉదయమే వారంతా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటింగ్ పూర్తి చేసుకుని సాయంత్రానికి ఇళ్లకు తిరిగి వెళ్లిపోయారు. గతంలో మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాల్లోని గిరిజనులు ఎన్నికలకు దూరంగా ఉండేవారు. కానీ కొన్నాళ్లుగా మావోయిస్టుల ప్రభావం తగ్గడంతో ఆయా ప్రాంతాల్లోని గిరిజనులు ఈ ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓట్లేశారు. జిల్లాలో పాడేరు నియోజకవర్గం పరిధి చింతపల్లి మండలం బలపం, అరకులోయ నియోజకవర్గం పరిధి ముంచంగిపుట్టు మండలం బుంగాపుట్టు, రంగబయలు, రంపచోడవరం నియోజకవర్గం పరిధిలోని గుర్తేడు, పాతకోట పోలింగ్ కేంద్రాలను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి అనుచరులు సైతం ప్రతి ఓటు కీలకమనే ఆలోచనతో ఓటింగ్ పెంచేలా చర్యలు చేపట్టారు. దీంతో మహిళలు, యువ ఓటర్లు సైతం ఈసారి పెద్ద ఎత్తున ఓట్లేసేందుకు ఆసక్తి కనబరిచారు. ఇలా అన్ని అంశాలు సైతం గిరిజన ఓటర్లను పోలింగ్ కేంద్రానికి రప్పించేందుకు దోహదపడ్డాయని స్పష్టమవుతున్నది.

అరకు పార్లమెంట్ పరిధిలో 73.68 శాతం

... 5వ పేజీ తరువాయి

వినియోగించుకున్నారు. నియోజకవర్గాల వారీగా చూస్తే..

- పార్వతీపురంలో 78.23 శాతం మేర పోలింగ్ నమోదైంది. ఇక్కడ మొత్తం 1,89,817 ఓట్లు ఉండగా.. ఇందులో 1,48,502 ఓట్లు పోలయ్యాయి. మహిళలు 75,908 మంది, పురుషులు 72,592 మంది ఇతరులు ఇద్దరు.. తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు.
- సాలూరు నియోజకవర్గంలో 76.45 శాతంగా పోలింగ్ నమోదైంది. ఇక్కడ మొత్తం ఓటర్లు 2,04,489 మంది కాగా 1,56,331 ఓట్లు పోలయ్యాయి.
- కురుపాంలో 78.54 శాతం మేర ఓటింగ్ నమోదైంది. ఈ నియోజక వర్గంలో 1,94,114 మంది ఓటర్లు ఉండగా.. 1,52,450 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- పాలకొండలో 75.26 శాతం పోలింగ్ నమోదైంది. ఇక్కడ 1,95,020 ఓట్లకు గాను 1,46,781 ఓట్లు పోలయ్యాయి.

రాత్రంతా జాగారం

... 5వ పేజీ తరువాయి



మంగళవారం తెల్లవారు జామున టెంట్‌లో ఉన్న సిబ్బంది

కె.వివేకానందన్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వేర్వేరు స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపరిచారు. అరకులోయ ఎంపీ స్థానం ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌కు జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత, పాడేరు అసెంబ్లీ స్ట్రాంగ్‌రూమ్‌కు ఆర్వో భావన వశిష్ఠ, అరకులోయ అసెంబ్లీ స్ట్రాంగ్‌రూమ్‌కు ఆర్వో అభిషేక్ సీలు వేశారు. ఈ మొత్తం ప్రక్రియను జిల్లా ఎన్నికల పరిశీలకుడు వివేకానందన్ పరిశీలిస్తుండగా, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సోమవారం అర్ధరాత్రి టెంట్‌లో వేచి ఉన్న సిబ్బంది

జిల్లాలో రాగల మూడు రోజుల్లో తేలికపాటి వర్షాలు

చింతపల్లి, మే 14: జిల్లాలో రాగల మూడు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని మంగళవారం ప్రకటించారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు పాడేరు, అరకు, చింతపల్లి, రంపచోడవరం డివిజన్ల పరిధిలో వర్షం కురుస్తుందని ఆయన చెప్పారు.